ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.16.11.2024 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాము చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
2. పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అంతర్భాగమని రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ రోజు జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటున్నారు.
3. పేదల నివాసాలను కూల్చకుండా మూసీ నది ప్రక్షాళన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ డిమాండు చేసింది.
4. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే మూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది

------------------------------

**CM-ప్రజావాణి:**

పేదల సమస్యల పరిష్కారం కోసం తమ ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం మంచి ఫలితాలిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. X వేదికగా ఈ విషయాన్ని చెబుతూ, ఒక పేద బాలిక ఆరోగ్య సమస్యపై అధికారులు వెంటనే స్పందించి, ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు సాయపడ్డారని

ఆయన పేర్కొన్నారు. ఆ బాలిక ఆయురారోగ్యాలతో కలకాలం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజావాణి ద్వారా వినతినందుకుని, వెంటనే స్పందించిన అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. బాలిక కుటుంబానికి శుభాకాంక్షలు చెప్పారు.

**MSL**

-----------------------------------

**రేవంత్ మహారాష్ట్ర**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు, రేపు మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. కాసేపటి క్రితం నాగ్ పూర్ చేరుకున్న ముఖ్యమంత్రి, చంద్రాపుర్, రాజురా, డిగ్రాస్, వార్ధా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరఫున ఈ రోజు ప్రచారం చేస్తారు. రేపు నయాగావ్, భోకర్, షోలాపుర్ ప్రచార సభలు, రోడ్ షోల్లో పాల్గొంటారు.

**డెస్క్**

---------------------------

**జాతీయ పత్రికా దినోత్సవం..**

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అంతర్భాగమని, పత్రికలకు ఆ స్వేచ్ఛ లేనప్పుడు అది ప్రజాస్వామ్యం కాబోదని రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షుడు కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో తెలంగాణ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన "నల్గొండ జిల్లా సర్వస్వం" ఆవిష్కరణ

కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... దేశంలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, ఇటీవల మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో జర్నలిస్టులు చనిపోవడం ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. అనేక ఆటంకాలతో పత్రికా స్వేచ్ఛ మనగడ ప్రశ్నార్థకమైందని, దీనిని ఎదిరించి కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్క జర్నలిస్టుపై ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మీడియా ప్రతినిధులు, సంస్థలు, ప్రజలకు పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మీడియా వృత్తిలో ఉన్నవారందరూ పత్రికా దినోత్సవాన్ని పాటించాలని సూచించారు. 1966లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటైన నవంబర్ 16ను దేశవ్యాప్తంగా జాతీయ పత్రికా దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

**పీటీసీ, నల్లగొండ**

-------------------------

**ప్రజా పాలన విజయోత్సవాలు**

ఈ నెల 19న వరంగల్ లో నిర్వహించనున్న ప్రజా పాలన విజయోత్సవాల ఏర్పాట్లను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఈ రోజు పరిశీలిస్తున్నారు. అనంతరం సభ నిర్వహణపై కలెక్టర్, కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు, చేపట్టినట్టి కార్యక్రమాలు, వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొనే వరంగల్

వేదిక నుంచి 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

**Desk**

---------------------------

**Encounter**

ఛత్తీస్ గడ్ లోని కాంకేర్ సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. ఎన్ కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారని, పోలీసులు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని సమాచారం.

**Desk**

--------------------------

**Fire Safety:**

అగ్ని ప్రమాదాల నివారణ, అగ్ని మాపక ప్రక్రియలపై రాష్ట్ర ప్రత్యేక భద్రతా దళాలు (SPF) కు సచివాలయంలోని ఫైర్ సర్వీసెస్ డిపార్ట్మెంట్ అవగాహన కల్పించింది. గతంలో తెలంగాణ స్పెషల్ పోలీసుల భద్రతలో ఉన్న సచివాలయం భద్రత ప్రస్తుతం, SPF పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సహాయ జిల్లా ఫైర్ ఆఫీసర్ GV ప్రసాద్ అధ్వర్యంలో మౌలిక అగ్నిమాపక ప్రక్రియలపై SPF కు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు, మంటలను అదుపు చేసేందుకు వాడే పరికరాల ప్రయోగాన్నీ, బాధితులను

తరలించే ప్రక్రియలను, బహుళ అంతస్తుల నుంచి రక్షించాల్సిన విధానాలనూ, కృత్రిమ శ్వాస, శ్వాస సంబంధిత వ్యాయామాలనూ ఈ సందర్భంగా వివరించారు.

**MSL**

-----------------------------

**MOOSI BJP**

పేదల నివాసాలను కూల్చకుండా మూసీ నది ప్రక్షాళన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని BJP డిమాండు చేసింది. దీనికోసం ఆ పార్టీ ఈ రోజు మూసీ నిద్ర కార్యక్రమాన్ని తలపెట్టింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు నిర్వాసితులకు మద్దతుగా, BJP రాష్ట్ర నాయకులు ఈ సాయంత్రం 4 గంటల నుంచి, రేపు ఉదయం 9 గంటల వరకు మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలతో గడపనున్నారు. తమ పార్టీ నాయకులంతా మూసీ పరీవాహక ప్రాంతంలోని వేరు వేరు చోట్ల ప్రజలతో కలసి వారి ఇండ్లలోనే నిద్రించి, వారికి భరోసా కల్పిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి G కిషన్ రెడ్డి చెప్పారు. కిషన్ రెడ్డి ఈ సాయంత్రం అంబర్ పేట్ నియోజకవర్గంలోని తులసి రామ్ నగర్ లో మూసి నిద్ర చేయనున్నారు. ఓల్డ్ మలక్‌పేటలోని శాలివాహననగర్‌లో కె.లక్ష్మణ్, ఎల్బీ నగర్‌లోని గణేశ్ నగర్‌లో ఈటల రాజేందర్, రాజేంద్రనగర్‌లోని హైదర్‌షా కోటలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అఫ్జల్‌గంజ్‌లోని రెసిడెన్షియల్ హౌసింగ్ బస్తీలో బీబీ పాటిల్ బస చేస్తారు. వారితో పాటు ఆయా ప్రాంతాల స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొంటారు.మూసీ ప్రక్షాళనను వ్యతిరేకించే నాయకులు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తే అక్కడి ప్రజల బాధలు తెలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బీజేపీ స్వీకరించింది, ఈ కార్యక్రమాన్ని తలపెట్టింది.

**MSL**

---------------------------------

**గ్రూప్-3 పరీక్ష**

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని పలు ఉద్యోగాల భర్తీ కోసం రేపు, ఎల్లుండి నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5 లక్షల 36 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానుండగా, ఒక వెయ్యి 401 కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్షల పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు అప్పగించారు. పరీక్ష నిర్వాహణకు సంబంధించి టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి వారికి తగు సూచనలు చేశారు. గ్రూప్ 3 పరీక్షకు మొత్తం మూడు పేపర్లు ఉండగా మూడు సెషన్లలో పరీక్ష జరగనుంది. రేపు ఉదయం జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్, మధ్యాహ్నం హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ, ఎల్లుండి ఉదయం ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్షను నిర్వహిస్తారు.

నల్లగొండ జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 28,353 మంది అభ్యర్థుల కోసం 88 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా బందోబస్తుకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 25 కేంద్రాల్లో 7వేల 62 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

**డెస్క్, పీటీసీ, నల్లగొండ, సిరిసిల్లా,**

----------------------

**వాతావరణం**

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే మూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, మహబుబ్ నగర్ జిల్లాల్లో ఈ రోజు తెల్లవవారు జామున 15 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రేపటి నుంచి మరిన్ని ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31, కనిష్ట ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలుగా ఉన్నాయి. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు, రేపు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కూడా వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**PN**

----------------------------

**తిరుమల**

తిరుమలలో రేపు కార్తీక వన భోజన కార్యక్రమం సందర్భంగా పలు ఆర్జిత సేవలను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది. వర్ష సూచనలో నేపథ్యంలో వన భోజనం నిర్వాహన వేదికను పార్వేట మండపం నుంచి వైభవోత్సవ మండపానికి మార్చినట్లు తెలపింది. రేపు ఉదయం పదకొండు గంటలకు గజ వాహనంపై

ఊరేగింపుగా మలయప్ప స్వామి రానున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

**PN**

------------------------------

**పొన్నం ప్రభాకర్**

కార్తీకమాసం పురస్కరించుకుని జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రజలు- రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

**పీటీసీ, జగిత్యాల**

-------------------------

**శంషాబాద్ బాంబు**

హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో బాంబు బెదిరింపు కలకలం రేపింది. హైదరాబాద్ నుంచి షార్జా వెళ్తున్న విమానంలో ఓ ప్రయాణికుడు తన వద్ద బాంబు ఉందంటూ కేకలు వేశాడు. అప్రమత్తమైన విమానాశ్రయ సిబ్బంది, వెంటనే తనిఖీ చేసింది. బాంబు లేదని తేలడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు.

**డెస్క్**

-----------------------

**ధాన్యం కొనుగోళ్లు**

సిరిసిల్లా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కొనుగోలు చేసిన ధాన్యం నకు త్వరగా చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు విషయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పీటీసీ, సిరిసిల్లా**

---------------------------

**భద్రాద్రి కొత్తగూడెం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ, మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఆసక్తిగల మైనార్టీ యువతకు IELTS, GRE మరియు TOFEL పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఎల్లుండి  నుంచి ఈ నెల 30వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని.. వివరాలకు 70955 42888కి  ఫోన్ చేయాలని కోరింది.

**పీటీసీ, కొత్తగూడెం**

--------------------------

**దక్షిణ మధ్య రైల్వే**

అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాదు, మచిలీపట్నం నుంచి కొల్లం మధ్య శబరిమలైకి ఈనెల 18 నుంచి నాలుగు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

**DESK**

-------------------------------------